**యేసుక్రీస్తు అందరికీ ప్రభువు** అపొ॥కా॥

*CHRISTAVANAADU Telugu Fortnightly Circulated in Andhra Pradesh*

*17-108, SANJAY GANDHI COLONY, HANUMANTHAVAKA JUNCTION, BEHIND DURGA TEMPLE, VISAKHAPATNAM - 40*

*RNI APTEL /2006/17980*
*e-mail : christavanaadu@yahoo.co.in.*

# క్రైస్తవనాడు

## ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

విశాఖపట్నం | సంపుటి : 1 | సంచిక : 14 | ఎడిటర్ : **వై. కనకరాజు** | 2007 **మార్చి 01-15** | పేజీలు : 8 | వెల : రూ. 5/-

# పరిశుద్ధుడు



విశ్వవ్యాప్తంగా నేడున్న ఆధ్యాత్మిక గ్రంథాలలో ప్రత్యేక స్థానంలో పరిశుద్ధ గ్రంథముగా క్రైస్తవులు నిత్యము చదువు బైబిలు పరిగణింపబడుతుందనటంలో ఎటువంటి సందేహము లేదు. బైబిలుకు గల ఎన్నో ఆధిక్యతలు తెలుసుకుంటుంటే తెలుస్తూనే ఉంటాయి. అత్యధికంగా ప్రపంచ భాషలలో ముద్రింపబడిన గ్రంథంగా బైబిలు గుర్తింపబడింది. బైబిలే ఎందుకు పరిశుద్ధ గ్రంథముగా మానవుల కియ్యబడిందని ఆలోచిస్తే అది అసామాన్యమైన విషయంగా కనపడ్తుంది. క్రైస్తవులైతే అది దైవసంకల్పంగా భావిస్తారు. ఇంతకూ క్రైస్తవులమైన మన దగ్గర బైబిలు రూపంలో ఉన్న పుస్తకం పరిశుద్ధమైనదా లేక అందున్న దేవుడు, ఆయన వాక్యాలు పరిశుద్ధమైనవా? అని ఆలోచిస్తే పుస్తకం ఎటువంటి పరిస్థితులలోను పరిశుద్ధమైనది కారాదు సుమా! అందున్న దేవుడును ఆయన కుమారులు మన ప్రభువైన యేసుక్రీస్తు (వాక్యం) మాత్రమే పరిశుద్ధులుగా మనం భావించాలి. ఇక్కడే ఒక విమర్శ సర్వసాధారణంగా మనకు వినబడుతుంది. దేవుడు పరిశుద్ధుడంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు గాని, ఈ విషయంలో యేసుక్రీస్తుని అనేకమంది అనేక రకాలుగా విబేధించుట మనం వింటుంటాం, చూస్తుంటాం. యేసుక్రీస్తుని ఎలా పరిశుద్ధునిగా చెప్పగలం అని బైబిలు (చరిత్రలో ఆధారాలు గల గ్రంథం)ను పరిశీలిస్తే....

ఆయన పుట్టుటలో పరిశుద్ధత కనబడ్తుంది. తల్లిదండ్రులకు లోబడి జీవించు విధానంలో పరిశుద్ధత. యవ్వన ప్రాయంలో కూడా దైవచిత్తాన్ని నెరవేర్చుటలో ఆయన అనుక్షణం తపించే విధానంలో ఎవ్వరూ ప్రశ్నించలేని పరిశుద్ధత. తన మూడున్నర సంవత్సరాల దేవుని రాజ్య స్థాపనా సువార్త ప్రకటనలో ఎటువంటి ప్రలోభాలకు, మారణకాండలకు, యుద్ధాలకు, శరీరేచ్ఛలకు లోనుకానటువంటి పరిశుద్ధత. మన జీవితాలెలా ఉంటున్నాయో ఒకసారి పరీక్షించుకొని సరిచేసుకుందాం. మానవుల పాపాలను కడిగి వేయుటకు తన స్వరక్తాన్ని శిలువలో చిందించుటకును, తద్వారా దైవ సంకల్పాన్ని ఇష్టంగా నెరవేర్చుటలో తేటగా అగుపడే పరిశుద్ధత. అటువంటి విపత్కర పరిస్థితులలో కూడా ఒక తల్లికి బిడ్డగా ఆయన తన తల్లిని శిష్యునికి అప్పగించుటలో మానవోత్కృష్టమైన పరిశుద్ధత. నేడు మనమెలాంటి జీవితంలో గడుపుతున్నాం మన తల్లి దండ్రులెక్కడున్నారు. ఆ శిలువలో ఇష్టంగా తన ప్రాణం మనందరి పాపాల ప్రాయశ్చిత్తం కొరకు పెట్టునపుడు కూడా ఆయన గూర్చి "లేఖనం నెరవేరునట్లు" అని వ్రాయబడింది. శిలువపై నిస్సహాయస్థితిలో (దేవుడు చెయ్యి విడువగా) కూడా లేఖనాలను గుర్తించుకొనే విధం, ఆ లేఖనాలను నెరవేర్చు విధానం మానవులకు అసాధ్యమనిపించక మానదు. మనమేం పరిస్థితుల్లో ఉన్నాం? మనకెంతవరకు లేఖనాలు గుర్తున్నాయి.

2లో...

# సద్విమర్శలు రాయండి

## పాత్రికేయులకు టిఎస్ఆర్ సూచన



విశాఖపట్నం, క్రైస్తవనాడు ప్రతినిధి: 'పాత్రికేయులు సాధారణంగా ఎవరినీ సన్మానించరు. వీలుంటే విమర్శలు గుప్పిస్తారు. నాకీ రోజున పాత్రికేయులు సన్మానించడం సంతోషకరంగా వుంది అని అన్నారు కేంద్రగనుల శాఖ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి, ఇటీవల సీతమ్మధార రైతు బజారు

2లో...

# పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక డ్రైవ్

## గ్రేటర్‌విశాఖ మేయర్ 'పులుసు'



బులుసు జనార్ధనరావు
కాంగ్రెస్

ప్పటికీ, దోమలు అధికంగా వుంటున్నాయని, దోమల నివారణ, పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టినట్లు నగరపాలక సంస్థ మేయర్ పులుసు జనార్థన రావు చెప్పారు. వార్డుల పర్యటనలో భాగంగా 27వ ఆర్డులో ప్రకాశరావుపేట, చాకలివీధి, కనకల దిబ్బ, లలితాకాలనీ, కృష్ణాగార్డెన్స్, బీమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మేయర్ పర్యటించారు. ప్రకాశరావుపేట చాకలివీధిలో గల గంగులగెడ్డలో పూడికలు తీసే కార్యక్రమాన్ని మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

2లో...


# మూడురోజుల దైవసేవకుల సదస్సు

**2007 మే 1,2,3 తేదీల్లో**

వాక్యోపదేశకులు
అపొ॥ **యనమల ఐజక్** గారు

ప్రభువు సేవకు పిలుపు కలిగి సంపూర్ణ సమర్పణతో సేవచేయుచున్న దైవసేవకుల కోసం సేవకుల సదస్సును ఫెయిత్ హోమ్ చర్చిలో మూడురోజులు ఏర్పాటుచేయడమైనది. ఇందులో అపొస్తలుల యొక్క బోధను, క్రమమును, ఉపదేశమును దైవజనులు అపొ॥ **యనమల ఐజక్** గారు, వారితో వున్న సేవకులు బోధించెదరు. దీని ద్వారా మీరు చేయుచున్న పరిచర్యలో అద్భుతమైన మార్పు కలిగి ప్రభువు సేవలో ఆత్మలు సంపాదించుటలో పరిశుద్ధాత్ముడు మీ సేవాజీవితంలో గొప్ప మలుపు త్రిప్పును. ఉత్సాహవంతులైన దైవసేవకులు మా ఆహ్వానాన్ని అందుకొని పాలుపొందవలసిందిగా ప్రేమతో ఆహ్వానించుచున్నాము. పాలుపొందువారు ఏ సంస్థలో చేరక స్వతంత్రంగా ఉంటూ విశ్వాసంతో సేవచేయువారై ఉండవలెను. రావాల్సిన వారు ముందుగా మాకు ఫోన్‌ద్వారా గానీ, లెటర్ ద్వారా గానీ తెలియపరచాలని ఆశిస్తున్నాం.

ప్రేమతో ఆహ్వానించువారు
**ఫెయిత్ హోమ్ మినిస్ట్రీస్**

సెక్టర్-1, ఎంవిపి కాలనీ, గ్రేటర్‌విశాఖ- 530 017,
**ఫోన్ : 0891-2531328**


**సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరం** - కీర్తన

(మొదటి పేజీ తరువాయి...)




ఎంతవరకు లేఖనాలను నెరవేర్చుటకు ఇష్టపడుతున్నాం?

ఒక్కసారైనా మనజీవితాలలో ఆలోచిస్తున్నామా? ఆలోచించాలి సుమా! మనలో అనేకులు సంవత్సరానికొకసారే దేవుని కార్యాలు గుర్తించుకొనేవారిగా కనబడ్తున్నారు. ఆయన శిలువపై చేసిన కార్యం మనదైనందిన జీవితాలలో అనుక్షణం గుర్తించుకోదగినది. ఆ కార్యమే ఆయన ఇష్టపడి చేయకపోతే నేడు ఆయన్ని లోక రక్షకునిగా మనం ప్రకటించుట దుస్సాహసమే. తన మూడున్నర సంవత్సరాల సువార్తా జీవితంలో ఆయన చూపిన ప్రేమ, కనబర్చిన సహోదరభావం అనుదినం అనుక్షణం మన జీవితాలలో కనబర్చాలి. లేకపోతే క్రైస్తవులుగా మనం పిలువబడుటకు అర్హులమా?అని అనిపించక మానదు. ఆదివారం, మిగతా రోజుల్లో కూటములందును, ఎల్లప్పుడును ఆయనను మనకన్నీ అనుగ్రహించమని అడుగువారిగా మాత్రమే మనముంటే ఆయన దృష్టిలో (లేఖనానుసారంగా) మనం వ్యర్థంగా మిగిలిపోతామనుటలో ఎటువంటి సందేహమక్కరలేదు. ప్రభువైన యేసుక్రీస్తు తన జీవితకాలంలో నెరవేర్చిన వాటిని తెలుసుకొనుటకు మన చేతిలో బైబిలుంది. అది చదివి ధ్యానించి మన బ్రతుకుకాలంలో అనుసరిస్తే చాలు మనమూ ఆయనలా దేవునికి పిల్లలంగా, ఆయనకు సహోదరీ సహోదరులంగా మారుతామనుట లేఖనానుసారం. ఇంతవరకూ ప్రభువు మనసెరిగి జీవించువారు అనేకులున్నారు. మనలో లేఖనానికి వ్యతిరేకంగా ఏవైనావుంటే మార్చుకొనుటకు ప్రయత్నించి ఆయన కృపకు పాత్రులగుటకు ఇష్టపడదాం. మననుండి తండ్రియైన దేవుడును, ఆయన కుమారుడైన యేసుక్రీస్తును కోరినదదేనని లేఖనాలు స్పష్టీకరిస్తున్నాయి. వారు పరిశుద్ధులుగా లేఖనాలయందు కన్పిస్తున్నారు. అవి చదువు మనమును పరిశుద్ధులుగా ఉండుటకు ఇష్టపడి లేఖనాలను మన జీవితాలలో ఘనపర్చుటకు ప్రయత్నిద్దాం! అందునిమిత్తమే కదా ప్రభువైన యేసుక్రీస్తు సదాకాలం మనకు తోడై ఉంటారని వాగ్దానం చేసారు.లేఖనాల్లో దేవుని కుమారునిగా కనబడినను తన బ్రతుకుకాలంలో ఆయన చూపిన పరిశుద్ధత మనకు మార్గదర్శకం కావాలి. అది ప్రకటించుటలో మన బ్రతుకులను పండించుకోవాలి. ప్రభువు అటువంటి సహాయం మనందరకును దయచేయాలని వేడుకుందాం.

ప్రభువైన యేసుక్రీస్తు శక పురుషులని నేడు లోకమంతా తెలుసు. ఆయన్ని బట్టి కాలాలను లెక్కించుటను తెలిసిందే. అటువంటి ఆధిక్యతలు గల ఆయనపై ప్రపంచంలో మరెవ్వరిపై రాని విమర్శలు చేస్తున్నవారు అక్కడక్కడ కనబడ్తున్నారు. కొందరైతే వారి స్వంత ప్రచారం కోసం ఆ విధంగా విమర్శిస్తున్నారని విజ్ఞులు చెప్తున్నారు. ప్రసిద్ధి చెందిన వారనేకులుండగా క్రీస్తుపై మాత్రమే విమర్శలు. ఎవరేమన్నను ఆయనపై వచ్చిన ఎటువంటి విమర్శయూ నిరూపింపబడక వీగిపోతున్నాయి. అన్నిటినీ జయిస్తూ జయశాలిగా యేసుక్రీస్తు పరిశుద్ధతను ప్రపంచానికి తెలియ జేయుచున్న బైబిలును క్రైస్తవులు కలిగి యుండుట గొప్ప భాగ్యంగా పరిగణించుకోవాలి. ఇవే విమర్శలు ఇంకొకరిపై రాకుండుట మన కన్నులకు ఆశ్చర్యమే. ఒకవేళ వస్తే వారి పరిస్థితి ఏమిటనేది కూడా ఆలోచించదగినదే. మనకైతే దేవుడు తన మహాకృపను బట్టి ప్రభువును, పరిశుద్ధులైన యేసుక్రీస్తను తన కుమారుని అనుగ్రహించినందుకు స్తోత్రములు చెల్లిద్దాం! తండ్రియైన దేవునికి ప్రభువైన యేసుక్రీస్తు నామమున కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించుచున్నాము.

- ఆమెన్ (అట్లవునుగాక)

# సద్విమర్శలు రాయండి

(మొదటి పేజీ తరువాయి...)

వద్ద వున్న విజెఎఫ్ నార్ల వెంకటేశ్వరరావు భవన్‌లో సుబ్బి రామిరెడ్డి రాజ్యసభ నిధులతో నిర్మించిన రెండు, మూడు అంతస్థు లకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. విలేకరులు నిష్పక్షపాతంగా వుండాలని సద్విమర్శలు ఎల్లవేళలా ఆహ్వానించ తగ్గవని ఆయన అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని రక్షించుకోవడంలో ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకమైనదని ఆయన చెప్పారు. సభకు విజెఎఫ్ అధ్యక్షులు శివశంకర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజెఎఫ్‌కు పన్నులు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. సీతమ్మధారలో విజెఎఫ్‌కు కేటాయించిన స్థలంలో కొంతభాగం వివాదాస్పదమయిందని, ఆ కారణం గా ఆ స్థలం యింకా తమ ఆధీనం లోకి రాలేదని, యీ విషయం త్వరితగతిని పరిష్కరించాలని కోరారు. కార్యదర్శి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన భవనాలలో జర్నలిస్టులకు ఉపయో గపడేలా ఓ గ్రంధాలయం, ఆధునిక జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్, శాసన సభ్యులు, కార్పొరేటర్లు, పాత్రికేయులు పాల్గొ న్నారు.

# 2వ వార్డులో వేగవంతంగా అభివృద్ధి పనులు

క్రైస్తవనాడు ప్రతినిధి, విశాఖపట్నం : గ్రేటర్‌విశాఖ రెండవ వార్డులో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఆ వార్డు కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రమాదాలకు నిలయంగా ఉండే పెదగదిలి-ఆరిలోవ రోడ్డును తారురోడ్డుగా నిర్మించారు. దీనితో ఆ రోడ్డు సౌకర్యవంతంగా మారి అనేకమంది ప్రయాణికులకు, వాహనచోదకులకు స్వర్గధామంగా మారింది. సన్యాసిరావు ఆ వార్డులోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించి ఆయా ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తున్నారు. ఇటీవల మేయర్ పులుసు జనార్థనరావు, డిప్యూటీ మేయర్ దొరబాబు కూడా ఈ వార్డులో పర్యటించారు.

వశిష్ట యూనివర్సల్ మ్యారేజెస్

క్రైస్తవ వివాహ వేదిక

అన్ని కులాల కన్వర్టెడ్ క్రిస్టియన్స్ సంప్రదించండి





43-11-15, బాబూ టవర్స్, సుబ్బలక్ష్మి కళ్యాణమండపం దగ్గర,
రైల్వేన్యూకాలనీ, విశాఖపట్నం - 16
ఫోన్ : 9392608090, 9247827225
0891-6523090

| H.O. హైదరాబాద్ | B.O. వరంగల్ |
| --- | --- |
| 1-9-286/2, | 2-5-305/ ఐబి లేన్, |
| బస్టాప్ దగ్గర, | నక్కలగుట్ట, హనుమకొండ, |
| రామనగర్ గుండు, | వరంగల్-506001, |
| హైదరాబాద్-500044 | ఫోన్ : 0870-3209080 |
| ఫోన్ : 040-27074090, | 9394608090, |
| 9393608090, 9247802007 | 93463 57360 |

# పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి...)

సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డులో దోమల నివారణకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి 350 కనెక్షన్లు ఇచ్చామన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలను పరిశుభ్రపరిచి దోమల నివారణకు చర్యలు తీసు కుంటున్నామన్నారు. ప్రజలు కళ్యాణ మండపం కట్టించమని కోరుతు న్నారని, అయితే మంచినీరు, విద్యుత్, పారిశుధ్యం మెరుగుకు మొదటి ప్రాధాన్యతనిచ్చి ఆర్థిక పరిస్థి తులను బట్టి కళ్యాణమండప నిర్మాణం చేపట్టడం జరుగుతుందని మేయర్ వివరించారు. కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం ప్రధాన సమస్యగా ఉందని, పారిశుధ్య నిర్మూలనకు దీర్ఘకాలిక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా పదిరోజుల పాటు ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించి కాలువల్లో పూడికతీత, డెబ్రిస్ తొల గింపు తదితర పనులు పూర్తి చేస్తామన్నారు. రాబోవు వర్షాకాలంలో పారిశుధ్యసమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

డిప్యూటీ మేయర్ కె.దొరబ్బాయి మాట్లాడుతూ క్రొత్త కౌన్సిల్‌కు ప్రజా రోగ్యంపై చిత్తశుద్ధి ఉందనడానికి ఈ ప్రత్యేక డ్రైవే నిదర్శనమన్నారు. సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పారిశుధ్యం మెరుగుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.విశాఖ రెండవ నియోజకవర్గ శాసనసభ్యులు సరిపల్లి రంగరాజు మాట్లాడుతూ ప్రతి మహిళా చైతన్యవంతమై అవగా హనతో పారిశుధ్య నిర్మూలనకు కృషి చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్న అభిప్రాయం వెలిబుచ్చారు. పర్యటన లో కనకలదిబ్బ ప్రాంతంలో పేద లకు నిర్మించిన ఇళ్లను కార్పొరేటర్ తైనాల విజయ్‌కుమార్ చూపించి గృహాలను లబ్దిదారులకు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ డా॥పి.పాండురంగారావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ఎంఎస్ రాజు, సిటీప్లానర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

శుభవార్త

పదిమందిని చందాదారులుగా చేర్పించండి. ఒక సంవత్సరం పాటు 'క్రైస్తవనాడు'ను ఉచితంగా పొందండి.

ఎడిటర్‌ను సంప్రదించండి
9849134647

ఉచితం!

'ప్రభువునందు నిద్రించిరి'
క్లుప్తంగా వ్రాసిపంపిన మరణవార్తల ప్రచురణ
ఉచితం... చందాదారులకు మాత్రమే

ఫోన్ : 9849134647, 0891-2760055, 9393121588

**నీవు నా తండ్రివి నా దేవుడవు - కీర్తన**




# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

సంపుటి :1 సంచిక : 14 మార్చి 01-15, 2007




## సరిచేసుకొనుటే క్రైస్తవ్యం

నేటి దినాల్లో చాలా ప్రాంతాల్లో క్రైస్తవం మీద అనేక అపోహలున్నాయి. అవి అపోహలా? నిజాలా? అన్పించుచున్నట్లు చర్చలు జరుగుతున్నాయి. క్రైస్తవం అంటే ఏమిటో తేటగా తెలియపర్చు అవకాశంగా ఆ చర్చల్ని మనం మార్చుకోవాలి. చర్చావేదిక ఏర్పాటు చేయాల్సిన అవసరం క్రైస్తవులకుందని గుర్తెరెగాలి. ఇదంతా సక్రమంగా జరగాలంటే బైబిలును క్షుణ్ణంగా ధ్యానించాలి. అలా ధ్యానించువారే చర్చా వేదికలందు క్రైస్తవం యొక్క ఔనత్యాన్ని ప్రకటించగలరు. అరకొర తెలిసిన వాళ్ళు క్రీస్తు మనకిచ్చిన ఆధిక్యతను ఎలా గుర్తించగలరు. ఎందరో క్రైస్తవ పండితులు గలరు. వారిలో ఎందరు బహిరంగంగా క్రీస్తును ప్రకటించగలుగుతున్నారు. యేసుక్రీస్తు క్రైస్తవమతాన్ని స్థాపించారా? లేదే, మరి క్రైస్తవం మతమెలా అయింది. క్రీస్తుని అనుసరించువారిని ఆనాటి దినాల్లో క్రైస్తవులన్నారని బైబిలు సాక్ష్యమిస్తుంది. క్రైస్తవులంటే వ్యక్తులు, సంస్థో, సిద్ధాంతమో, సమాజమో కాదు. క్రీస్తు బోధల్ని అనుసరించి నడుచుకొంటూ అందరకును వాటిని ప్రకటించుటకు బయలు వెళ్ళు వ్యక్తులే క్రైస్తవులు. మనుషుల్లో గల చెడును పోగొట్టి సన్మార్గాన నడుపుటకు యేసుక్రీస్తు బోధల్ని లోకానికి చెప్పువారే క్రైస్తవులు. తండ్రియైన దేవుని చేరుటకు నేనే మార్గమని స్వసాక్ష్యమిచ్చుకున్న యేసుక్రీస్తుని ప్రకటించు వారే క్రైస్తవులు. ఆయన సర్వలోక పాపాల్ని శిలువలో చిందించిన తన పరిశుద్ధ రక్తంతో కడిగివేసినట్లు బైబిలునందున్న వచనాల్ని లోకానికి తేటగా తెలియజెప్పవారే క్రైస్తవులు. అటువంటి బహుబాధ్యతల్ని తన్ననుసరించువవారికి అప్పగించి నెరవేర్చమన్న క్రీస్తును ప్రకటించుటే క్రైస్తవలక్ష్యం. ఆ లక్ష్యం నెరవేర్చుటలో తమ బ్రతుకుకాలమంతా ఆయన ఆజ్ఞ ప్రకారం తమ్ముతాము తగ్గించుకొంటూ , సరిచేసుకుంటూ జీవించుటకు ఇష్టపడువారే క్రైస్తవులు. అందరకును తేటగా తమ అభివృద్ధి అధ్యాత్మికంగా కనబర్చు ఆశక్తి గలవారిగా అనేక క్రైస్తవులున్నారు. ప్రతిక్షణం తమనుతాము సరిజేసుకొనుటకు ఇష్టపడువారే అధిక శాతం గలరు. అంతము వరకు తమను స్థిరపరుస్తానన్న ప్రభువు ఇచ్చిన వాగ్దానం బట్టి తమ బ్రతుకు కాలంలో అనేక మార్పులు అనుభవిస్తున్నవారే క్రైస్తవులు. తమ జీవితాలలో ఈ మార్పుకు ప్రభువైన యేసుక్రీస్తు కృపే కారణమని సంపూర్ణంగా విశ్వసించువారే క్రైస్తవులు. ఇలా జీవించువారెందరో లోకానికి సజీవ సాక్ష్యముగా కన్పడుచున్నారనుట అతిశయోక్తి కానేరదు. క్రైస్తవులందరూ ఆ విధంగా తమ బ్రతుకుకాలమంతా తమనుతాము సరిచేసుకొనుటకు ప్రయత్నిస్తే అటువంటి సహాయం దయచేయుటకు ప్రభువు ఎల్లప్పడూ సిద్ధమే. సరిచేసుకుందాం! మన అభివృద్ధి తేటగా కనబడునట్లు జీవిద్ధాం!!

**"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము మా కొరకు ప్రార్థించుడి" (2 థెస్స 3:1)**

**క్రైస్తవనాడులో ప్రచురించు బైబిలుకు సంబంధించిన ప్రతి వివరణ అనంతమైన దేవుని జ్ఞానంలో కొంతమాత్రమే. మరెక్కువ తెలుసుకొనుటకు మీ సందేహాలను వ్రాయండి. మీ, మా క్రైస్తవనాడులో వివరణాత్మకంగా ప్రచురించుటకు అవకాశం ఇచ్చినవారిలో మీరు ఒకరై ఉండాలనే మా ఆకాంక్ష.**

మీ అడ్వర్టైజ్‌మెంట్లు మొదలగువాటి విషయమై ఎడిటర్‌ను సంప్రదించగలరు.

**ఎడిటర్ : వై.కె. రాజు, సెల్ : 98491-34647**

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం

**"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటి వరకూ సైన్సు సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలియజెప్పటకు చేయు ప్రయత్నమే ఈ "దేవునిజ్ఞానం - మానవ విజ్ఞానం" శీర్షిక ముఖ్యోద్ధేశము.**

**2**

## భూమిని గూర్చి శాస్త్రవేత్తలు.....

మానవ విజ్ఞానంతో నేటివరకూ కనుగొన్న భూగోళ సంగతులు మీరు మునుపటి సంచికలో కొంతమట్టుకు తెలుసుకున్నారని నమ్ముతున్నాం. ప్రియులారా! శాస్త్రవేత్తలు భూమినిగూర్చి తెలుసుకున్నవి మనకు ఆశ్చర్యంగా అన్పిస్తుంటాయి. ఔరా అన్పించక మానవు ఆ లెక్కలు, కొలతలు, ఇంతకూ ఆ కొలతలు భూమి ఉండుట వలనే కదా? ఆ భూమే ఎందు కుందని మనకై మనం ప్రశ్నించుకుందాం! దీనికి జవాబు ఎవరు చెప్పగలరు? ఎవరునూ చెప్పజాలరు. చూశారా ఇలా మనల్ని మనం సృష్టిలో మనకంటికి కనబడునవి, కనబడని వాటిని గూర్చి ఆలోచిస్తుంటే సమాధానాలు చెప్పుట అసాధ్యంగా కన్పిస్తాయి. ఎందుకంటే వాటి కంటే ముందు తమనం సృష్టించబడలేదు కాబట్టి, ఇదే సమాధానం మనకు ఎవరినుండైనా వస్తుంది. ఒక వస్తువైనా మరేదైనా సృష్టించబడాలంటే వాటిని సృష్టించినవారు లేకుండా అవి సృష్టించబడవని ఎవరైనా సుళువుగా చెప్తారు. ఏదీ తనంత తానుగా సృష్టించబడలేదు. భూమిని గూర్చి చెప్పాలంటే ఎవరు చెప్తారని మనమాలోచన చేస్తే భూమిని చేసే వారుంటే వారే చెప్పాలని మనం తలచవచ్చు. ఇక్కడే మానవులకు సృష్టిని నిర్మించిన సృష్టికర్త అవసరం వస్తుంది. ఎవరా సృష్టికర్త అని మనం తర్కిస్తే దేవుడని ఆస్తికులు టక్కున చెప్తారు. సృష్టికర్తను గూర్చి మన అభిప్రాయం ఇలావుంటే శాస్త్రవేత్తలు ఆలోచనలెలా ఉన్నాయో చూడండి. క్రీ॥శ॥

### బైబిల్ × సైన్స్

1960లలో అంతు తెలియని శక్తి ఏదో గ్రహాలు, నక్షత్రాలు, చెల్లాచెదురుగా ఎగిరిపోకుండా విశ్వంలో అడ్డుకుంటుందని గుర్తించారు. ఇది గురుత్వాకర్షణ శక్తి కాదనియు గుర్తించారు. శాస్త్రవేత్తలకు తెలియని, అంతుపట్టని ఆ శక్తినే ఆస్తికులమైన మనం సృష్టికర్తయని దేవుడని భావిస్తున్నాము.

సృష్టికర్తను గూర్చి తెలుసుకోవాలంటే ఆయనే తనను తాను బయల్ప రచుకోవాలేగాని మానవులు పరీక్షలు జరిపి తెలుసుకొనుట బహుకష్టం. సృష్టికర్తే మనల్ని కూడా చేసారని నమ్ముతున్నాం ఆస్తికులమైన మనందరం. మనల్ని చేయుటకు కూడా ఆయనకొక కారణముండాలి. అందువలన ఆయన మనకు తనను గూర్చి తెలియజేయుటకు అవకాశమెక్కువ. అలా ఆయన తనను బయల్పరచుకున్న విధానం సంపూర్ణంగా పరిశుద్ధ గ్రంథంగా మనచే పిలవబడుచున్న బైబిలునందున్నదని క్రైస్తవులమైన మనం నమ్ముతున్నాం. బైబిలునందున్న లేఖనాలు దేవుడు (సృష్టికర్త) ఆత్మయని చెప్తున్నాయి. దేవుడు పరిశుద్ధుడు గనుక ఆయన ఆత్మయు పరిశుద్ధమేనని బైబిలునందున్న దాన్ని బట్టి మనం తెలుసుకుంటున్నాం. ఆ లేఖనాలన్నియు పరిశుద్ధాత్మ ప్రేరణచే వ్రాయబడెననియు మనకు తెలుసు. వాటిని వ్రాయుటకు దేవుడు ఎన్నుకున్నవారు పరిశుద్ధ ప్రవక్తలనియు బైబిలు సాక్ష్యమిస్తుంది. ఇన్ని కారణాలు

## భూమిని గూర్చి దేవుని గ్రంథంలో.....

బైబిలును సంపూర్ణంగా బలపర్చుట వలన బైబిలును సంపూర్ణంగా దైవింకంగా ధ్యానిస్తే దేవునిగూర్చి తెలియశక్యమైనదేదో తెలుస్తుందని సులువుగా గ్రహించవచ్చు. కాబట్టి భూమినిగూర్చియు, సృష్టిలోనున్న ఇతర సృష్టాలను గూర్చియు బైబిలును పరిశోధిసస్తూ ముందుకు సాగుదాం! ముందుగా భూమిని గూర్చి ఆలోచన చేద్దాం.

భూమిని గూర్చి దైవగ్రంథం బైబిలు ఏం చెబుతోంది...

**భూమిని ఆయన నరులకిచ్చి యున్నాడు** (కీర్తన 115:16)

పై వచనం ప్రకారం దేవుడు తన పిల్లలైన మనకు భూమిని ఇచ్చియున్నారని నమ్మాలి. వ్రాయబడియున్న పై వచనం ప్రకారం భూమిపై తప్ప విశ్వంలోగల ఇతర గ్రహాలయందు నరులును లేనట్లు తెలుస్తుంది. శాస్త్రవేత్తలు ఎంత ప్రయాసపడినను వేరే గ్రహాలలో మనలాంటి జీవులున్నట్లు కనుగొనలేకపోవుచున్నారు. దేవుని మాట అబద్ధంకానేరదు. ఆయన మాటలు జీవం గలవి.

**భూమి ఎన్నటికిని కదలకుండునట్లు ఆయన దానిని పునాదులు మీద స్థిరపరిచెను.** (కీర్తన 104:5.)

భూమికి పునాదులు ఉన్నవని, వాటిపై భూమిని దేవుడు స్థిరపరిచెనని పై వాక్యంలో మనకు తెలుస్తుంది. పునాది అంటే కట్టబడిన కట్టడాన్ని కదలకుండా, పడకుండా మోసేది అని మనకు తెలుసు.

(సశేషం)


# సర్వ సత్య మహాసభలు

ముఖ్య ప్రసంగీకులు :

అపొ॥ **అద్దంకి రంజిత్ ఓఫీర్** గారు

**నర్సీపట్నం**

**2007 ఏప్రిల్ 24,25,26**

సిబిఎం కాపౌండ్, నర్సీపట్నం, చింతపల్లిరోడ్

కన్వీనర్ : దైవసేవకురాలు రోజా;

సెల్ : 9391682974

వివరాలకు : ఎలీషా, సెల్ : 9391185124

**విశాఖపట్నం**

**2007 మే 7, 8, 9 ప్రతిరోజు సాయంత్రం 6 గం॥లకు మరియు 8,9 తేదీలలో ఉదయం 10 గంటలకు బైబిల్‌స్టడీ**

మున్సిపల్ గ్రౌండ్, కోరమాండల్ గేటు ఎదురుగా, శ్రీహరిపురం, విశాఖపట్నం - 11

నిర్వాహకులు : పాస్టర్ వేల్పుల సత్యనారాయణ

ఓఫీర్ మినిస్ట్రీస్ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రతినిధి,

ఎస్.ఎఫ్.ఎ-223, ఆటోనగర్, విశాఖపట్నం-12,

సెల్ : 9948810378


**నీ దేవుడనైన యెహోవాను నేనే -నిర్గమ**

KSM

MARRIAGE BUREAU

TRAVELS (Abroad Services)

MARINE ACADEMY







D.No. 40-56-1, Sanjeevayya Colony, Near Logos Church, NH-5 Road, Waltair R.S.,
Visakhapatnam, A.P. **Phone : 0891 - 2520714, Cell :98850 73965**

**మీ ప్రకటనలు క్రైస్తవనాడు ద్వారా ఆంధ్రా అంతటా తెలుస్తాయని గమనించండి**

*మీ సంఘాలలో చేయు సువార్త, సేవాకార్యక్రమాల వివరాలు మాకు పంపి, 'క్రైస్తవనాడు'ద్వారా అందరికీ తెలియునట్లు ప్రకటించండి. మరనేకులు అలా చేయుటకు పురిగొల్పువారిలో మీరు పాలివారవండి.*

**ఫోన్ : 98491-34647, 0891-2760055, 9393121588**

# పాతదైపోయిన కొత్త సంవత్సరం!

– సైమన్ డేనీ

ప్రియమైన స్నేహితులకు, అపుడే పాతదైపోతున్న నూతన సంవత్సర శుభాకాంక్షలు! సంవత్సరం కొత్తదేగాని జీవితం పాతదే. క్రీస్తు లేకుండా ఈ జీవితం కొత్తజీవం పుంజుకోదు. మనసు నూతన పరచబడాలి. మన ఆలోచనా సరళి, విశ్వాస పరిథి, ఆత్మీయ జీవన విధానం మారాలి. పులిసిన పాత పిండిని- ఆలోచనలు, ఆశలు, అలవాట్లు ఈ సంవత్సరంలోకి తీసుకువచ్చారా! ఈ సంవత్సరమంతా పులుసిపోతుంది. పాతవి గంతించెను అని ఎలా చెప్పగలం. ఎఫెసీ 4:22, కొలస్స 3:9,10. ఎన్నో సంవత్సరాలు వస్తాయి, పోతాయి మనలో పాతవి ఏవి పోతున్నాయి? క్రొత్తవి ఏవి వస్తున్నాయి? పాపం పోయి పరిశుద్ధత వస్తుందా, పరిశుద్ధత పోయి పాపం వస్తుందా? ఈ సంవత్సరం చూడడానికి దేవుడు మనల్ని బ్రతికించివుంచాడంటే, ఆయన కోసం మనం ఏదో చేయవలసి వుందన్నమాట. నీ దాసుడు (దాసురాలు) ఆలకించుచున్నాడు, ఆజ్ఞ ఇమ్ము అనే స్థితిలో వున్నామా? లేక , ప్రభువా, నేను ఆజ్ఞయిస్తున్నాను, ఆలకించు అనే స్వార్థ స్థితిలో వున్నామా? ఏమి చేయమంటావు ప్రభువా అంటున్నారా? లేక ఏమి చేస్తావు ప్రభువా అంటున్నారా?

నా రెండో తమ్ముడు, మణిపూర్‌లో కొండ ప్రజలకు చదువు చెప్పే రోజులవి, - 1982- స్నానం చేయడానికి గెడ్డలోకి దిగాడు. వెంటనే లోతిలోకి పోయాడు, కొట్టుకుంటున్నాడు, క్షణాల్లో ప్రాణం పోతుంది, మొఖంలో, కళ్ళల్లో చావుకళ వచ్చేసింది. ఈతరాదు. గట్టుమీదనున్న తోటి టీచర్ గమనించి వెంటనే చిన్న పుల్లముక్క అందించాడు. ప్రాణం రక్షించబడింది. యిపుడు పెళ్ళి చేసుకుని ఇద్దరి పిల్లల్ని కని, వందలాది మంది పిల్లలకు చదువు చెప్పుతున్నాడు. జీవితం అనే ఈ సముద్రంలోకి ఈత రాకుండా దిగి ఆనందించాలనుకుంటున్నావేమో, జాగ్రత్త!

పుల్లముక్క అందించే యేసు ఒడ్డున నీకోసం ఉన్నాడో లేడో చూస్కో! యేసు సన్నిధి లేకుండా నీ జీవితంలో సుఖం వుండదు. ఎవరికీ సుఖాన్ని అందించలేవు. అమ్మానాన్నలు క్రైస్తవులా? ప్రతీరోజా బైబిలు చదువుతున్నావా? ప్రార్థన చేస్తున్నావా? ఇలాంటివి మరో వంద చేస్తున్నావా?లాభం లేదు. యేసు ఎక్కడ వున్నాడు? హృదయంలోనా,బయటా? ఎవరు చెప్పింది వినకు. “ఇదిగో నేను తలుపు నొద్ద నిలుచుండి తట్టుచున్నాను'' అనే మాటలు ఎన్నోసార్లు విని వుంటావు. ఇపుడు నిర్లక్ష్యం చేయకు. తలుపు తీయి. కొత్త సంవత్సరం కాదు-కొత్త జీవితం మొదలవుతుంది ఈ సంవత్సరం చేయవలసినవి ఆయనకే తెలుసు. అడుగు దాని ప్రకారం చేయి. పథకాలు వేయకు, పతనమైపోతాయి. నెలసరి ఆదాయం వుంది. భార్య వుంది, పిల్లలు వున్నారు, సెటిల్ అయిపోయానను కుంటున్నావేమో. మంచి సంఘం వుంది కాంక్రీటు స్లెబు వేయించావేమో- మంచిగా దశమభాగాలు, కానుకలు కూరగాయలు, బియ్యం....వస్తున్నాయి. ఇది దేవుని చిత్తం కాకపోతే ఇంకేంటి? అనుకుంటున్నావేమో. అవన్నీ నీవు కావాలని చేసుకున్నావేమో. వందలాది మంది దగ్గర బిక్షమెత్తుకుని చేసావేమో, నీకూ నీ దేవునికి మధ్యలో నీవు కట్టుకున్న ఆ చర్చే అడ్డం వస్తుందేమో చూస్కో. లోలోపల నిన్ను నీవే మెచ్చుకుంటున్నావేమో. ముందు ప్రభువు పనేమిటో సెటిల్ చేయి.

(ఇంకావుంది)

**మీ ప్రకటనలు క్రైస్తవనాడు ద్వారా ఆంధ్రా అంతటా తెలుస్తాయని గమనించండి**

**మీ సంఘం/సంస్థ కోసం 'క్రైస్తవనాడు'లో పేజీ, అరపేజీ, పావుపేజీ ప్రకటనల కాంట్రాక్టు కొరకు సంప్రదించండి. కాంట్రాక్టు ఆరు నెలలు/ ఆ పైబడినదై ఉండాలి.**

సంప్రదించండి! బలపరచండి!!

ఆసక్తిగల వారు 'క్రైస్తవనాడు'లో ఒక పేజీకి సరిపోయే ప్రకటనలు తీసుకువచ్చి తగిన ఆదాయం పొందండి.

**శుభాకాంక్షలు:**

పుట్టినరోజు, పెళ్లిరోజు, పండుగరోజులు, శుభవార్తలు మొదలగునవి కేవలం రూ.600లకే మీ క్రైస్తవనాడులో ప్రకటించండి! ఆరు నెలల పాటు పత్రిక ఉచితం. ప్రకటించుకునే అవకాశం మూడుసార్లు (పై వాటిలో ఏవైనా సరే)

**క్లుప్త ప్రకటనలు:**

పోస్టుకార్డు మీద ఒకవైపు రాసి పంపించే ఏ ప్రకటనైనా క్రైస్తవనాడులో రూ.300లకే ప్రచురిస్తాం.

**ఫోన్ : 98491-34647, 0891-2760055, 9393121588**

## టి.వి. లో క్రైస్తవ ప్రసంగాలు

**ఆదివారం**

ఈ-టి.వి 2లో డి.జి.ఎస్ దినకరన్ మరియు పాల్ దినకరన్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాయస్ మేయర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో పి. సతీష్ కుమార్ ఉదయం 7 నుంచి 7-30 గంటల వరకు
మా-టి.విలో ఎన్. జయపాల్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
తేజ టి.విలో జట్సన్ అబ్రాహాము ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు

**సోమవారం**

ఈ-టి.వి 2లో డి.జి.ఎస్ దినకరన్ మరియు పాల్ దినకరన్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాయస్ మేయర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో కె.ఆర్. సింగ్ ఉదయం 7 నుంచి 7-30 గంటల వరకు
మా-టి.విలో జట్సన్ అబ్రాహాము ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
తేజ టి.విలో పి. జోషి ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు

**మంగళవారం**

ఈ-టి.వి 2లో డి.జి.ఎస్ దినకరన్ మరియు పాల్ దినకరన్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాయస్ మేయర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జోయల్ జశ్వంత్ గుమ్మడి ఉదయం 7 నుంచి 7-30 గంటల వరకు
మా-టి.విలో యు.సోలోమోను ఉదయం 6 నుంచి 6-30 గంటల వరకు
మా-టి.విలో జాషువా గూటాం ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
తేజ టి.విలో జాషువా డాన్యియల్ ఉదయం 6 నుంచి 6-30 గంటల వరకు
తేజ టి.విలో టి.డి. ప్రసన్న కుమార్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు

**బుధవారం**

ఈ-టి.విలో డి.జి.ఎస్ దినకరన్ మరియు పాల్ దినకరన్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాయస్ మేయర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాన్ లాజసర్ ఉదయం 7 నుంచి 7-30 గంటల వరకు
మా-టి.విలో సుదర్శన్ పి.జ్యోతి ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
తేజ టి.విలో జోసెఫ్ కిషోర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు

**గురువారం :**

ఈ-టి.విలో డి.జి.ఎస్ దినకరన్ మరియు పాల్ దినకరన్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాయస్ మేయర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జి. ఎస్తేర్ రాణి ఉదయం 7 నుంచి 7-30 గంటల వరకు
మా-టి.విలో క్రీస్తుజ్యోతి ఆశ్రమం (ఆర్.సి.ఎం) ఉదయం 6.00 నుంచి 6.30 గంటల వరకు
మా-టి.విలో పి.జె. స్టేఫిన్‌పాల్ ఉదయం 6.30 నుంచి 7.00 గంటల వరకు
తేజ టి.విలో ఎన్. జయపాల్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు

**శుక్రవారం**

ఈ-టి.విలో డి.జి.ఎస్ దినకరన్ మరియు పాల్ దినకరన్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాయస్ మేయర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో కె.ఎ. పాల్ ఉదయం 7 నుంచి 7-30 గంటల వరకు

**శనివారం**

ఈ-టి.విలో డి.జి.ఎస్ దినకరన్ మరియు పాల్ దినకరన్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జాయస్ మేయర్ ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
జడ్-టి.విలో జి. మోషేష్ చౌదరి ఉదయం 7 నుంచి 7-30 గంటల వరకు
మా-టి.విలో దైవవాక్కి (ముత్తంగి) ఉదయం 6 నుంచి 6-30 గంటల వరకు
మా-టి.విలో యజ్ఞమూర్తి వేణుగోపాల్ ఉదయం 6-30 నుంచి 7గంటల వరకు
తేజ టి.విలో జి. శామ్యూల్ ఉదయం 6 నుంచి 6-30 వరకు
తేజ టి.విలో జాషువా గూటాం ఉదయం 6-30 నుంచి 7 గంటల వరకు
విస్సా చానల్‌లో 7.00 నుండి 7.30 వరకు పి.జె.స్టీఫెన్ పాల్ 'దైవసన్నిధి'
ఈ-టి.విలో కె.ఎ. పాల్ ఉదయం 8-30 నుంచి 9 గంటల వరకు



# చాకిరేవు



- ఎడిటర్

## అనేక ప్రాంత క్రైస్తవుల అభిప్రాయాలను సమీక్షిస్తూ వ్రాయబడుచున్న ప్రత్యేక కథనం... (1)

# సంఘాలలో...కూటములలో... కాపరుల విశ్వాసుల బాధ్యత

ప్రియులారా! నేడు సంఘాలలో కన్పించు అనేక లోటుపాట్లకు విశ్వాసులు కూడా కొంత కారణంగా కనబడుతున్నారు. చాలామంది కూటములకు, ఆరాధనలకు వెళ్ళునపుడు సమయాన్ని క్రమంగా పాటించుట లేదని చెప్పవచ్చు. కుటుంబాలలో బాధలు, అవసరాలు ఏర్పడినపుడు మాత్రం వారు దేవుని ఎక్కువగా గుర్తుచేసుకొనేవారిగా ఉంటున్నారు. అలా వుంటే దేవుని ఎదుట వారు అవసరాలను తీర్చుకొనువారిగా మాత్రమే మిగిలిపోతారు. వారికి అవసరాల్లోనే వారి కాపర్లు, మందిరాలు, సంఘాలలో మిగతా విశ్వాసులు గుర్తుకొచ్చి ప్రార్థన చెయ్యమంటూ చెప్పుట మనమనేక చోట్ల చూస్తుంటాం. ఇదెంత వరకూ న్యాయమోనని అటువంటి స్వభావం గల విశ్వాసులు వారికివారే ప్రశ్నించుకోవాలి. దేవుని యెదుట తమను తామే సరిచేసుకొనుటకు ప్రయత్నించాలి. ఇంకొందరు విశ్వాసులైతే వారి కాపర్లపై వింత వింతైన అభియోగాలు మోపుతుంటారు. ఉదాహరణగా..ఒకే చోట నలుగురి విశ్వాసుల గృహాలుంటే వారి పాస్టరు పరిస్థితిని బట్టి ఒక గృహాన్ని దర్శించి తన పనిపై వెళ్ళారనుకోండి మిగతా ముగ్గురు విశ్వాసులు వారింటికి పాస్టరు రానందుకు అనేక సందేహాలతో సతమతమైపోతూ ఏవేవో ఊహించుకుంటారు. అలా విశ్వాసులు ఆలోచించుట వలన సంఘాలకు మేలు కలుగదు కాని కీడు జరుగుట కెక్కువ అవకాశం ఉంటుంది. అటువంటప్పుడు పాస్టరు అందరిని ఒకేలా ప్రేమించువారని ఆ ఇంటిలో ఆయన అవసరం ఉండబట్టే వెళ్ళుంటారని విశ్వాసులు మంచిగా ఆలోచించుకోవాలి. వీలైతే తమవంతుగా వీరును వారి పాస్టరుతో ఏకీభవించి సహాయమందించుటకు ప్రయత్నించాలి. అలా విశ్వాసులుంటే సంఘాలలో అభివృద్ధికి లోటేం ఉంటుంది. ఆ విధంగా విశ్వాసులను మంచిగా ఆలోచించు వారినిగా తీర్చిదిద్దుటలో కాపరులు కూడా తమవంతు బాధ్యత సక్రమంగా నిర్వర్తించువారిగా వుండాలి. ఆ విధంగా వున్న సంఘాలు క్రీస్తుకై అనేక ఆత్మలను సంపాదించుటలో ముందుంటాయనుటలో మనకెటువంటి సందేహమక్కరలేదు. సంఘం, కాపరుల ప్రతి అవసరతను విశ్వాసులు తెలుసుకోవాలి. తమకున్నంతలో తీర్చుటకు ప్రయత్నించాలి. సంఘమంతా ఒకే కుటుంబంగా విశ్వాసులు భావించాలి. ఎవరికీ అవసరం వున్నా అది కుటుంబ అవసరంగా తలంచాలి. తమ మిత్రులలోను, కుటుంబస్థులలోను క్రీస్తు నెరుగని వారిని సంఘాలకు నడిపించుటకు విశ్వాసులు బహుజాగ్రత్తలు తీసుకోవాలి. వారు సంఘాలకు రావాలంటే క్రీస్తుకు మాదిరిగా ఉండునట్లు విశ్వాసులు తమ జీవన విధానాలను మలచుకోవాలి. అలా వచ్చు ఇతరులను క్రీస్తువైపు నడుపునపుడు కాపర్లు జాగరూకతతో వ్యవహరించాలి.

కాపరులు కూడా విశ్వాసులందర్ని సమదృష్టితో చూడగలగాలి. అలా చూడకపోవుటచే కొన్నిచోట్ల సంఘాలలో బేధాభిప్రాయాలొచ్చి విడిపోవుట చూస్తున్నాం. విశ్వాసులలో కొందరిని ఎక్కువగా, మరికొందరిని తక్కువగా చూచే కాపర్లున్న ఏ సంఘమైన ముక్కలైపోతుందనుటలో అనుమానంలేదు. అందునుబట్టి కాపరులు, విశ్వాసులు, కలయికలో ఒకరియందొకరు క్రీస్తు పంచిన ప్రేమనే చూడగలగాలి. అలా లేనప్పుడు వారు సాతాను ఉచ్చులో సులువుగా పడిపోతారు. విశ్వాసుల ఆలోచన ఎల్లప్పుడు క్రీస్తు తమ కొరకు చేసిన కార్యాలను తెలిసికొనుటకే ప్రయత్నించాలి.

ఇతరుల కార్యాలేం చేస్తున్నారని ఆలోచించుట తగదుసుమా! క్రీస్తు నెరుగుటకు ప్రయత్నించుటనగా నిత్యజీవాన్ని పొందుటకు ఆశక్తి కనబర్చుటేయని క్రైస్తవులందరును తమ బ్రతుకుకాలంలో గుర్తించుకోవాలి. సంఘాలలో విశ్వాసులకు మాదిరిగా కాపరుండాలి.

కాపరుల నడిపింపును ప్రత్యక్షంగా లోకానికి కన్పించునట్లు విశ్వాసులుండాలి. ఆ విధంగా ఉన్న సంఘాలవల్ల మన ప్రభువైన యేసుక్రీస్తును సర్వలోకం మహిమ పరుస్తుందనుటలో సందేహం మనకేలా?

(సశేషం)

# తెలుసుకుందాం!

- ❄ బైబిలునందు పాతనిబంధనలో మొత్తం అక్షరాలు 27,21,100
- ❄ క్రొత్త నింబంధనలో మొత్తం అక్షరాలు 8,45,380
- ❄ పాతనిబంధనలో "విమోచన" గుచ్చిన వచనాలు 4,736
- ❄ క్రొత్త నిబంధనలో విమోచన గుచ్చిన వచనాలు 2,934
- ❄ మొత్తం బైబిలునందున్న వాగ్దానములు 30,000
- ❄ మొత్తం బైబిలునందున్న ఆజ్ఞలు 6,468
- ❄ మొత్తం బైబిలునందున్న ప్రవచనములు 5,355
- ❄ మొత్తం బైబిలునందున్న ప్రశ్నలు 3,294
- ❄ మొత్తం బైబిలునందున్న దీవెనలు 8,000

-సేకరణ: **వి. విన్సెంట్‌బాబు,** గాజువాక, గ్రేటర్‌విశాఖ

- ❖ సోక్రటీస్ తన భోధనలకు సంబంధించి ఏమీ వ్రాయకున్నను ఆయన శిష్యులే వాటికి ప్రాచుర్యం కల్గించారు.
- ❖ పిరమిడ్లు సూడాన్ దేశంలో ఎక్కువగా ఉన్నయి.
- ❖ క్లియోపాత్రా అనగానే ఒకరాణి పేరుగా మనకు తెలుసు. నిజానికి ఈజిప్టు సింహాసనాన్ని అదిష్టించిన వారు ఏడుగురు కూడా కియోపాత్రను పేరుగలవారే! మనకు తెలిసిన, చెప్పుకునే క్లియోపాత్ర ఏడోరాణి.
- ❖ ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ ఒకచేత్తో వ్రాస్తూ మరోచేత్తో బొమ్మ గీయగల నైపుణ్యం కలవాడు.
- ❖ నీరో చక్రవర్తి మీద ఒక అపవాదు మనకు వినపడుతుంది.
- ❖ రోమ్‌నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించాడని, అదెంతమాత్రం నిజంకాదని చరిత్ర చెప్తుంది. ఎందుకంటే ఫిడేలు (వయోలిన్) అప్పటికింకా తయారుచేయబడలేదు.
- ❖ క్రీ॥శ॥ 1747లో మొట్టమొదటి సుఖవ్యాధుల హాస్పటల్ లండన్‌లో లాక్ హాస్పిటల్స్ పేరిట ప్రారంభించారు.
- ❖ అమెరికా ప్రెసిడెంట్ జాన్‌ఎఫ్‌కిన్నడీ హత్యగావించ బడ్డారని మనకు తెలుసు. అంతకుముందే క్రీ॥శ॥ 1835లో అమెరికా ఏదో అధ్యక్షుడు ఆండ్రూజాక్సన్ పై హత్యాయత్నం జరిగింది. రిచర్డ్ లారెన్స్ చేసిన ఈ హత్యాయత్నమే ఒక ప్రెసిడెంట్‌పై చేసిన తొలి హత్యాయత్నం.
- ❖ క్రీ॥శ॥ 1935లో అబార్షన్‌ను చట్టబద్దం చేసిన తొలిదేశం ఐస్‌లాండ్
- ❖ మన సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానం క్రీ॥శ॥ 1950లో ఏర్పాటైంది.
- ❖ అచ్చుయంత్రాన్ని కనిపెట్టి బైబిలును ప్రపథమంగా ముంద్రించుటకు కారకులు జాన్‌గూటన్‌బర్గ్ అని మనకు తెలుసు. మరి ఆయన పుట్టినరోజు? క్రీ॥శ॥ 1468సం॥ ఫిబ్రవరి 3.
- ❖ మన దేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ రైలు క్రీ॥శ॥ 1925లో బాంబే వి.టి. స్టేషన్- కుర్లా నడుమ నడిచింది. దూరం సుమారు 9.5 మైళ్ళు.

-సేకరణ: **వై.ఎల్. రవిరాజు,** గ్రేటర్‌విశాఖ




**బైబిల్ ప్రాముఖ్యత**

ఏప్రిల్ నెల నుండి...

మీ... మా...
**క్రైస్తవనాడు**
చందాదారులై
సువార్తకు
సహకరించండి
ఆధ్యాత్మిక మేలు
పొందండి

కమిషన్‌పై మార్కెటింగ్
చేయుటకు ఆసక్తిగలవారు
వెంటనే సంప్రదించండి.

సెల్ : 98491 34647

# శతాధిపతి కొర్నేలు రక్షణ పొందుట

మరి నీవు రక్షణ పొందితివా...?

(అపొ॥ 10:1-47)

(గత సంచిక తరువాయి...)

దర్శనములను చూపించి, నీవు లేచి క్రిందకి దిగి సందేహింపక వారితో కూడా వెళ్లుము అని బోధించెను.

కొర్నేలి ప్రార్థించినప్పుడు దర్శనమిచ్చి జవాబు ఇచ్చెను. అపొస్తులుడైన పేతురు ప్రార్థించినప్పుడు దర్శనములనిచ్చి తన చిత్తమును బయలు పరిచి తన సేవకు నడిపించెను. క్రైస్తవుడయిన నీవు ప్రార్థన నేర్చుకొన్నావా? దేవుని సేవ చేయుచున్న నీవు ప్రార్థన ద్వారా సేవలో నడిపించబడుచున్నావా? ప్రభు వాక్యము ఆయన ఇచ్చే దర్శనములు సత్యమని ఒప్పుకొంటున్నావా? మీరు విసుగక నిత్యము ప్రార్థించమని యేసుప్రభువారు బోధించారు (లూక 18:1) ప్రార్థన ద్వారానే సృష్టికర్తయిన ప్రభువుతో నీవు సంబంధము, సహవాసము కలిగియుండగలవు. అలవాటు ప్రార్థనల ద్వారా నీవు ఏ మేలు దేవుని యొద్ద నుండి పొందలేవు.

యూదుడైన పేతురు అన్యులైన కొర్నేలి చేత పంపబడిన ఆ ముగ్గురిని చేర్చుకుని వారికి ఆతిధ్యమిచ్చి వారు ఎందుకు వచ్చినది తెలుసుకొనెను. వారు పేతురు గారికి చెప్పిన విషయం ఏదనగా శతాధిపతియైన కొర్నేలి, దర్శనమందు పరిశుద్ధ దూత వలన బాధింపబడి, పేతురు అను నిన్ను తన ఇంటికి పిలుపించుకుని, నీవు చెప్పు మాటలు వినవలెనని ఆజ్ఞ పొందెను గనుక నిన్ను తీసుకొని వెళ్లుటకు వచ్చితిమి అని చెప్పిరి.

మరునాడు పేతురు, ఆ ముగ్గురు మనుష్యులు బయలుదేరి కైసరయ అను కొర్నేలి పట్టణమునకు వచ్చిరి. అప్పుడు కొర్నేలి తన బంధువులను, ముఖ్య స్నేహితులను పిలిపించి వారికొరకు కనిపెట్టుచుండెను.

పేతురు లోనికి రాగా కొర్నేలి అతనిని ఎదుర్కొని అతని పాదముల మీద పడి నమస్కారము చేసెను. అందుకు పేతురు లేచి నిలువుము నేను కూడా నరుడనే అని చెప్పి లోపలికి వచ్చెను. అనేకులు కూడియుండుట పేతురు చూచెను. అప్పుడు పేతురు ఈలాగు బోధించెను. అన్యజాతివానితో సహవాసము చేయుటయైనను, అట్టివానిని ముట్టుకొనుటయైనను యూదునికి ధర్మము కాదని మీకు తెలియును. అయితే ఏమనుష్యుడు నిషేధింపదగినవాడని యైనను, అపవిత్రుడనియైనను చెప్పకూడదని దేవుడు నాకు చూపించియున్నాడు. కాబట్టి నన్ను పిలిచినప్పుడు అడ్డమేమియు చెప్పక వచ్చితిని. గనుక ఎందు నిమిత్తము నన్ను పిలువనంపితిరో దానిని అడుగుచున్నానని వారితో చెప్పెను.

అప్పుడు కొర్నేలి తనకు నాలుగు దినముల క్రిందట కలిగిన ప్రభువు దూత దర్శనము, దూత చెప్పిన విషయాలు పేతురు గారికి చెప్పెను. అపుడు పేతురు నోరు తెరచి ఇట్లనెను. దేవుడు పక్షపాతి కాడు. ప్రతి జనులోనూ, ఆయనకు భయపడి, నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును. యేసుక్రీస్తు అందరికి ప్రభువు (అపొ 10:36) దేవుడు నజరేయుడైన యేసును, పరిశుద్ధాత్మతోనూ, శక్తితోనూ అభిషేకించెను. దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలు చేయును. అపవాది చేత పీడింపబడిన వారిని స్వస్థపరిచెను. ఆయన యూదయ దేశమందును, యెరూషలేము నందును చేసిన వాటికన్నింటికి మేము సాక్షులము. ఆయనను వారు (యూదులు) మ్రానున (సిలువ) వ్రేలాడదీసి చంపిరి. దేవుడాయనను మూడవ దినమున లేపెను. ఆయన మృతులలో నుండి లేచిన తరువాత మాకే ఆయన ప్రత్యక్షముగా కనబడునట్లు అనుగ్రహించెను. ఇదియే గాక దేవుడు సజీవులకును, మృతులకును న్యాయాధిపతిగా నియమించినవాడు ఈయనే అని దృఢముగా సాక్షమియ్యవలెనని ఆజ్ఞాపించెను.



బ్రదర్ గండి శామ్యూల్‌జాన్
పి.ఎం.పాలెం, గ్రేటర్ విశాఖ

ఆయనయందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామమూలముగా పాపక్షమాపణ పొందునని ప్రవక్తలందరు ఆయనను గూర్చి సాక్షమిచ్చుచున్నారనెను.

పేతురు ఈ మాటలు ఇంకా చెప్పుచుండగా విన్నవారందరి మీదకి పరిశుద్ధాత్మ దిగెను. తరూత ఆ మాటలు విన్న వారందరు యేసుప్రభుని నమ్మి బాప్మిస్మ సాక్ష్యమిచ్చిరి.

ఈరీతిగా కొర్నేలి ఆయన ఇంటివారు యేసుప్రభు నందు విశ్వాసముంచి, పాపక్షమాపణ పరిశుద్ధాత్మను పొంది, బాప్తిస్మము పొంది పరిపూర్ణ విశ్వాసులు ఆయెను.

ప్రియమైన చదువరీ! ప్రభువైయ యేసుక్రీస్తు ద్వారానే పాపక్షమాపణ, రోగ నివారణ శాంతి సంతోషములు మనము పొందగలము.

కొర్నేలి చేసిన ధర్మకార్యములు, ఇంటివారందరితో భయభక్తులు కలిగియుండుట.... ఎల్లప్పుడు ప్రార్థించుట అను నీతిక్రియలు, ఆయన ఆత్మరక్షణ, పాపక్షమాపణ పొందుటకు నడిపించాయి. అనేక క్రైస్తవులు గుడికి వెళ్లుట ద్వారా, చందాలు ఇచ్చుట ద్వారా , ప్రార్థనలు చేయుట ఆ్వరా తృప్తిపడుచున్నారు. ఇప్పుడైతే అంతటా అందరూ మారుమనస్సు (రక్షణ) పొందవలెనని ప్రభువు ఆజ్ఞాపించుచున్నాడు. (అపొ 17:30) శతాధిపతి కొర్నేలి క్రీస్తుయేసులో పొందిన అనుభవాలు, ఆత్మ రక్షణ నీకున్నవా? పరీక్షించుకొని దేవుని బిడ్డవు కమ్ము.

యేసుక్రీస్తు ప్రభువుసజీవుడు. మరలా ఆయన తిరిగి రానైయున్నారు. తిరిగి వచ్చి పాపక్షమాపణ ప్రభువు నెరిగిన వారిని పరలోక రాజ్యముననకు తీసుకొనిపోవును. గనుక ప్రియ చదువరీ! యేసుప్రభువే రక్షకుడు. నిజదేవుడని నమ్ము.

నీ పాపములు ఆయన సన్నిధిలో ఒప్పుకొని విడిచిపెట్టి ప్రార్థించు. ప్రభువు నీ పాపములు క్షమించాడని నమ్మి, బాప్తిస్మము పొందు. రక్షింపబడిన వారి సహవాసములో ఉండు. ప్రభువు నీకు తోడై నిన్ను రక్షించుగాక!

# పూజార్హుడైన దేవుడు

బోధకులకు బోధకుడు సద్బోధకుడు
వైద్యులకు వైద్యుడు పరమవైద్యుడు
వ్యవసాయకులకు వ్యవసాయకుడు మంచి వ్యవసాయకుడు
శాస్త్రజ్ఞులకు శాస్త్రజ్ఞుడు సకల శాస్త్రాల జ్ఞానుడు.
నాయకులకు నాయకుడు మాదిరి గల నాయకుడు
స్నేహితులకు స్నేహితుడు నిజస్నేహితుడు పాపుల స్నేహతుడు
ప్రవక్తలకు ప్రవక్త గొప్ప ప్రవక్త అని చెప్పుకున్నవాడు
సమస్తమును సృష్టించిన సృష్టికర్తయైనవాడు
నేతలకు నేత దేశాలకధినేతగా పైనున్నవాడు
విశ్వాసమునకు కర్త పరిశుద్ధ గ్రంథకర్త తానైనవాడు
పరిశుద్ధులకు పరిశుద్ధుడు పరిశుద్ధాత్మ వలన జన్మించినవాడు
ప్రపంచమును ప్రభావితం చేసిన చరిత్రకారుడు
రోగులను స్వస్థపరిచి ఆశీర్వదించిన కరుణామయుడు
చనిపోయినవారిని వాక్శక్తితో బ్రతికించిన ఆశ్చర్యకరుడు
సర్వలోకరక్షణకై శిలువనెక్కిన వీరుడు
సాతాను చెర నుండి విడిపించుటకై రక్తం కార్చిన దైవనరుడు
పాపపరిహారం నిమిత్తం ప్రాణంపెట్టిన కరుణామయుడు
మృత్యుంజయుడై మరణం గెలిచి తిరిగి లేచిన పునరుత్థానుడు
నమ్మినవారికి నిత్యజీవమిచ్చి పరము చేర్చువాడు
నమ్మనివారికి తీర్పు తీర్చి నిత్య నరకమను
అగ్నిగుండములో పడవేయువాడు
ఇహ పరలోకంలో కృపను విస్తరింపజేసిన కృపామయుడు
స్తుతులకు పాత్రుడు కృతజ్ఞతలు చెల్లించుటకు స్తోత్రార్హుడు
పామరుల చేతను పండితుల చేతను పొగడబడినవాడు
దీనుల చేతను జ్ఞానుల చేతను ఆరాధింపబడినవాడు
సకల దేవతలు నమస్కరించు దేవుడు
సమస్త జనులు సాగిలపడి మ్రొక్కు పూజార్హుడు
ఎవరీ ఘనుడు
ఆయనే.... తండ్రియైన యెహోవా
కుమారుడైన యేసుక్రీస్తు
ఆత్మస్వరూపియైన పరిశుద్ధాత్ముడు
త్రియేక దేవుడు
సర్వసృష్టికి ఒకే దేవుడు

- పాస్టర్ మాదం భాస్కర్, కడప జిల్లా





ప్రప్రథమ గ్రేటర్‌విశాఖ మేయర్
శ్రీ పులుసు జనార్థనరావు గారికి,
డిప్యూటీ మేయర్ శ్రీ కొరారి దొరబాబు గారికి

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

అభినందనలు

అగాపే క్రైస్తవ వివాహవేదిక

రక్షణ, మారుమనస్సు
పొందిన క్రైస్తవ విశ్వాసుల
కొరకు స్థాపించబడిన
క్రైస్తవ ఆధ్యాత్మిక
వివాహవేదిక



సంప్రదించండి : పాస్టర్ వేల్పుల సత్యనారాయణ,
ఎస్ఎఫ్ఎ-223, ఆటోనగర్,
విశాఖపట్నం-12, బిహెచ్‌పివి పోస్ట్, ఫోన్ : 9948810378

వసతి

నెలసరి ఆదాయం వున్న ఒంటరి వృద్ధ
క్రైస్తవులకు (పురుషులకు) వైద్యం తప్ప,
'పూర్తి సేవలతో భోజన వసతులు కేవలం
నెలకు రూ. 2,400/- మాత్రమే!

వివరాలకు : సైమన్ డేనీ
సెల్ : 9247181897
(రాత్రి 8 నుండి 10 వరకు)

గమనిక: మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు.

# మినిస్ట్రీలు

## చేయవలసినదేమిటి? చేస్తున్నదేమిటి?

ధారావాహికం-6

- ఎడిటర్

◆ **తమ ఆస్తియే ప్రాపకమని తమ ధన విస్తారతను బట్టి పొగడు కొనువారికి నేనేల భయపడవలెను**

(గత సంచిక తరువాయి)

ప్రభువైన యేసుక్రీస్తు మనకిచ్చిన అధికారం అదేనని గ్రహించండి. లేఖనానికి వ్యతిరేకంగా ఎవరున్ననూ వారిని ఖండించుటకును, గద్దించుటకును, బుద్ధిచెప్పుటకును, తప్పుదిద్దుటకును అధికారం గలవారమని క్రైస్తవులు గుర్తెరగాలి. ఎందుకంటే దైవజనుడనని చెప్పుకొనువారెవరైనను సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండాలని లేఖనం మనకు సాక్ష్యమిస్తుంది. అందునుబట్టి లేఖనాలకు అనుకూలంగా లేని ఏ మినిస్ట్రీవారైననూ సరిచేసుకోవలసిందే గాని సరి చేయువారిని తప్పుపట్టరాదు.

◆ **వారు - నీ మార్గములను గూర్చిన జ్ఞానము మాకక్కరలేదు. నీవు మమ్మును విడిచి పొమ్మని దేవునితో చెప్పుదురు.**

పై లేఖనము చూసారుగా ఆ విధంగా దేవుని జ్ఞానము మాకక్కరలేదని చెప్పువారిగా క్రైస్తవులుండరాదు సుమా! మన బ్రతుకు కాలమంతా లేఖనాలను ఎరుగుటకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. లేఖనాలను విబేధిస్తూ మనుష్యులను దేవునికంటే అధికంగా తలంచువారు శ్రమలకు లోనవుటకు ఆస్కారం అధికం. లోకములో వారికి స్వతంత్ర్యంగా గుర్తింపే వుండదు. జీవితమంతా ఒకరి చాటుగానే ఉంటూ ముగించుకుంటారు. స్వతంత్ర గుర్తింపు ఇచ్చే క్రీస్తును ఘనపరచకపోతే, వారి నాయకుల్నే ఘనపరుచుకుంటు కూర్చుంటే ఎలా? అందును బట్టి వారు తమ బ్రతుకుకాలమంతా వారి నాయకులకు సేవ చేయువారుగాను మిగిలి పోతారు. క్రీస్తు కొరకు ఉపయోగించని ఎవరి బ్రతుకైనను వ్యర్థంగానే మిగులుతుందని లేఖనసారం అందును బట్టి మన జీవితాలలో ఇప్పటినుండైనా క్రీస్తును ఘనపరుచుటకు ఇష్టపడదాం. దేవుని దృష్టిలోను, మనుషుల దృష్టిలోను మనం లేఖనాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చువారిగా కనబడతాము. పై వాక్యంలో వలే దేవుని గూర్చిన జ్ఞానం మాకక్కరలేదు, మమ్మల్ని విడిచిపో అని దేవునితోను చెప్పువారిగా మనముండరాదు. దేవుడే మనల్ని విడిస్తే మనబ్రతుకులెలా తయారవుతాయో మనకు తెలియంది కాదు. అందును బట్టి క్రైస్తవనాడు ఎల్లప్పుడును లేఖనాలను గౌరవిస్తుంది. సరిచేసుకొనుటకై ఇష్టపడుతుంది. కాబట్టి లేఖన దూరమైనవి మీకు క్రైస్తవనాడులో కనబడితే మాకు తెలియజేయండి. ఎందుకనగా లేఖనాలను పాటిస్తే చాలు భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా గౌరవించినట్లేనని పండితుల అభిప్రాయం. లేఖనాలకే వ్యతిరేకులైతే దేశసార్వభౌమత్వాన్ని ఏం గౌరవించగలరని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. అందునుబట్టి క్రైస్తవ పండితుల, విజ్ఞుల మాటను ఆలోచించవలసిన అవసరం క్రైస్తవులకు ఎంతైనా వుందని అనిపించకమానదు. నేడు అనేక సంఘాలలో గల విశ్వాసులకు వారి నడిపింపుదారులే ఎంతో గొప్పవారిగా కన బడుచున్నట్లు తెలుస్తోంది. వారి నాయకుల్ని యేసుక్రీస్తు కంటే ఎక్కువగా అభిమానిస్తున్నట్లుందని వారి ఆరాధనా ధోరణిని చూస్తుంటే తెలుస్తుంది. అటువంటి వారెవరైనా లేఖనాలను కలుగజేసిన క్రీస్తుకంటే ఎవ్వరూ గొప్పవారు కారని అతి త్వరగా గ్రహిస్తే మంచిదని క్రైస్తవభక్తుల అభిప్రాయం. వారి నాయకులెవ్వరైనా కానీవ్వండి వారు లేఖనాలకు లోబడే మనస్తత్వం కలవారిగా ఉండాలని అత్యధిక క్రైస్తవుల అభిప్రాయం. క్రైస్తవనాడు ద్వారా ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి బైబిలునందున్న విషయాలు ఎన్నో తెలుసుకుంటున్నామని ఆంధ్రాఅంతటి నుండి మాకు వచ్చుచున్న అభినందనలను గూర్చి మీరందరూ ఆలోచించాలనే మా విన్నపం. మీరు ఒకసారైనా క్రైస్తవనాడును సంపూర్ణంగా చదవండి. బైబిలునందున్న లేఖనాలతో సరిపోల్చండి. మీకు నచ్చితే చందాదారులై సహకరించండి. క్రైస్తవనాడు మరింత విస్తరించుటకు మీ వంతు సహాయం మీరందించండి. మీ అమూల్యమైన సలహాల కొరకు వేచి ఉన్నాము. మీ మీ ప్రార్థనలలో మమ్మును గుర్తించు కొంటారు కదూ...


(సశేషం)

**ఆంధ్రాలో కొన్ని ప్రముఖ మినిస్ట్రీలు వాటి అధిపతులుగా పరిగణింపబడుతున్నవారు**

- గుడ్‌న్యూస్ ఫెలోషిప్ మినిస్ట్రీస్, థియోడర్ వెస్లీ, విశాఖ
- ట్రూ గాస్పల్ ఫెలోషిప్, జె.పి.ఆర్.పట్నాయక్, సబ్బవరం, విశాఖ
- ఫెయిత్ హోమ్ మినిస్ట్రీస్, సి.హెచ్. దానియేలు, విశాఖ
- డివైన్ ప్రేయర్ సెంటర్, జి.స్టీఫెన్‌పాల్, టి.వి.స్పీకర్, విశాఖ
- యూనివర్సల్ చర్చి మినిస్ట్రీస్, శుభాకరశాస్త్రి, ప॥గో॥ జిల్లా విశాఖ వరకు సంతోష్‌బాబు
- షమ్మా మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్, జోయల్ జస్వంత్ గుమ్మడి, సికిందరాబాద్
- న్యూ బ్లోసమ్ మినిస్ట్రీస్, థెరిసాపాల్, హైదరాబాద్


గమనిక : ◆ గుర్తువున్న వచనాలు పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లోనివి.

**యేసుక్రీస్తు ఆశీర్వాద పండుగలు**



20, 21, 22 ఏప్రియల్ 2007 సా॥ 6.00 గం॥లకు
లూథరన్ హైస్కూల్ గ్రౌండ్స్, భీమవరం
వాక్యోపదేశకులు : ఇటర్నల్ యం.అనిల్‌కుమార్ గారు, సిటిజన్ ఆఫ్ ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్
నిర్వాహకులు : భీమవరం పాస్టర్స్ ఫెలోషిప్ సెల్ : 9246692177, 9440986157
వివరములకు : ఆఫీస్ నెం. 10-8-4, మర్చెంట్స్ రెసిడెంట్స్ బిల్డింగ్, చినరంగనిపాలెం రోడ్, భీమవరం -1,
ఆఫీస్ నెం. 92470 43888, 92467 56888

**ఆశీర్వాద, సువార్త, స్వస్థత సభలు**
ఏప్రిల్ 27,28,29,30 మే 1 2007
శుక్ర, శని, ఆది, సోమ, మంగళ వారములలో
తణుకు
ప్రతిరోజు సా॥ 6.30 గం॥లకు
యస్.సి.ఐ.యమ్. గవర్నమెంట్ కాలేజీ
రోగుల కొరకు ప్రత్యేకమైన ప్రార్థనలు చేయబడును.
అందరూ ఆహ్వానితులే!
వాక్యపరిచర్య మరియు ప్రార్థన
సహో॥ హ్యారీగోమ్స్ గారు, కొయంబత్తూర్



**మీ ప్రకటనలు క్రైస్తవనాడు ద్వారా ఆంధ్రా అంతటా తెలుస్తాయని గమనించండి**

**మీ మాట- మా మాట**
'పాఠకులపేజీ' కోసం మీ ఉత్తరాలకై వేచి వున్నాం.


'క్రైస్తవనాడు' కొరకు ప్రార్థించండి!
చందాదారులై ప్రోత్సహించండి !!
ప్రకటనలిచ్చి సహకరించండి!

ఫోన్ : 98491-34647, 0891-2760055, 9393121588

RNI APTEL/2006/17980



# యు.పి.ఎఫ్.వారి ఆధ్వర్యంలో... బిషప్ డా॥కె.జాన్‌పీటర్ సారథ్యంలో
## పిట్టల వేమవరం, రావులపాలెం దరి ఘనంగా జరిగిన 3రోజుల
# సువార్త రక్షణ కూటములు



ప్రసంగానికి సిద్ధపాటు.....

క్రైస్తవనాడు ప్రతినిధి : క్రీ.శ. 2007 మార్చి 7,8,9 తేదీలలో రావులపాలెం దరి తణుకు రోడ్డునున్న గ్రామం పిట్టల వేమవరంలో క్రీస్తురక్షణ కూటములు బహుఘనంగా జరిగాయి. పాస్టర్ జోసఫ్ దంపతులు సభలను ఆద్యంతము చక్కగా నడిపారు. పాస్టరు దంపతులు ప్రతి సంవత్సరం ఇటువంటి సభలు జరుపుతారని పరిసర ప్రాంతీయులు చెప్తున్నారు. ఈసారి వారు గ్రేటర్ విశాఖలో ప్రముఖ క్రైస్తవ నాయకులుగా పరిగణింపబడుచున్న బిషప్ డా॥ కె.జాన్‌పీటర్, యు.పి.ఎఫ్. ఫౌండర్ & డైరెక్టరును ముఖ్య ప్రసంగీకులుగా ఆహ్వానించారు. తన కార్యక్రమాలలో ఎంతో బిజీగా ఉన్ననూ ఆహ్వానాన్ని మన్నించి తన యుపిఎఫ్ టీమంతటితోను వెళ్ళి సభలు మరి ఘనంగా జరుగునట్లు కాపరి దంపతులను బలపర్చాడు. రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్న గ్రామంలో కూడా ప్రతి విషయంలో జాగ్రత్త తీసుకున్న కాపరి దంపతులు ఎంతో అభినందనీయులు. పరిసర ప్రాంతీయులైన విశ్వాసులకు ప్రయాణ బడలిక లేకుండా సభలకు వచ్చునట్లు చేసిన ఏర్పాట్లు బహు ప్రశంసనీయం. అటువంటి గ్రామాల్లో స్టేజ్ అంత చక్కగా ఏర్పాటుచేస్తారని ఎవరూ ఊహించలేరు. మూడురోజుల్లోను సాయంకాల సమయంలో ఎంతో చక్కని రక్షణ సువార్తను అందించిన బిషప్ డా॥కె. జాన్‌పీటర్ మరియు యు.పి.ఎఫ్.వారు ఎంతైనా అభినందనీయులు. కూటాల్లోనే మధ్యలో ఒక రోజు పాస్టర్స్ సదస్సును నిర్వహించి పరిసరప్రాంత పాస్టర్లందరిని వాక్యంలో ఎంతోబలపర్చిన యు.పి. ఎఫ్. వారు వారికి మాదిరి చూపారు. ముగింపురోజున పాస్టర్ దంపతులు బిషప్ డా॥ కె.జాన్‌పీటర్ ద్వారా అభిషేకం పొందుటకు ఇష్టపడి ప్రార్థన చేయుంచుకుని అభిషేకం పొందామని చెప్పారు. ఇది సంప్రదాయమా? ఆచారమా? లేక మెప్పు పొందుటకా? అని సభలకు వచ్చినవారందరూ అనుకుంటున్నారు. హృదయాలను పరిశోధించు దేవుని ఎదుట ఉన్నామని తెలియనివారము కాము. రెండవరోజు ఉదయకాలమున విశ్వాసి ఒకరు తమ శ్రమలను పాస్టర్ జోసఫ్‌కు వివరిస్తుండగా అవేవి వినకుండా ప్రభువు ప్రభుచేస్తాడు, ప్రభువు చేస్తాడు అంటూ సాగనంపుటకే ఎక్కువ



పాస్టర్ దంపతులను అభిషేకిస్తూ...

ఇష్టపడ్డారని తెలుస్తుంది. ఇలా చేయుటెంతవరకు సమంజసమని చూసినవారు మాట్లాడుకుంటున్నారు. పాస్టరుకే ఏదైనా అవసరమొస్తే, ఇతరుల సహాయం కోరితే వారు అలాగున చేస్తే ఈయన పరిస్థితేంటని ప్రశిస్తున్నారు. సాధగారణంగా ఈ రోజుల్లో ఎవరైనా ఏదో విధంగా ఎవరి దగ్గరైనా లబ్ధిపొందుటకే ఇష్టపడుతుంటారని, పాస్టర్ల ఆలోచనలు కూడా అలాగున తయారైతే ఎలా అని చర్చించుకుంటున్నారు. వారైతే ఎవరిదగ్గరికైనా వెళ్తూ ఏదో ఒక కథ చెప్పి సంపాదించు కొంటుంటారు. విశ్వాసులు వారి దగ్గరికొస్తే ప్రభువు చేస్తాడు అని చెప్తూ మభ్యపెట్టువారెక్కువయ్యారని వినికిడి. అటువంటి ఆలోచనలున్న వారెవరైనను మార్చు చెందుటకే దేవుడు సమస్యలను సొంతంగా విని తమ సహాయం అందించువారిని భూమిపై లేపుతాడని అలా లేపబడిన వారే బిషప్ డా॥కె.జాన్‌పీటర్ అని అక్కడ కూడిన వారిలో ఆయన్నెరిగిన వారు చెప్పారు. బిషప్ డా॥కె.జాన్‌పీటర్ వారి కుటుంబం పరిచర్యను ఎంత ప్రేమిస్తారో, ఎంతగా ఆదరిస్తారో తెలియజేయుటకే దేవుడు యుపిఎఫ్ వారిని అక్కడకు పంపారని తలచవచ్చు. బిషఫ్ డా॥కె.జాన్‌పీటర్, వారు స్థాపించిన యుపిఎఫ్ పరిచర్యను, వారి ఆదరణను మార్గదర్శకంగా చేసుకున్నవారు సేవలో బహుబలంగా వాడబడ్డారని క్రైస్తవ పెద్దలెందరో చెప్తుంటారు. ఆయన చేయు సేవ అసామాన్యమని ఆయన చూపు ప్రేమను, చెప్పే వాక్యమును గ్రహించువారు క్రీస్తు



విశ్వాసుల కోరికపై అందరి కోసం ప్రత్యేక ప్రార్థన

సేవలో ముందంజలో ఉంటారని భక్తి పరులైన క్రైస్తవులెందరో చెప్తుంటారు. బిషఫ్ డా॥ కె. జాన్‌పీటర్ మరియు యుపిఎఫ్ వారితో పాస్టర్ జోసవ్ దంపతులు ముందు ముందు ఏ విధంగా సహవాసం కలిగి వుంటారో చూడాల్సిందే. బిషప్ డా॥కె.జాన్‌పీటర్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా, ఒరిస్సా, బెంగాల్‌నందును అనేకచోట్ల మహాసభలున్నవని చెప్పారు. వారి కొరకు ప్రార్థించవలసిన అవసరం అందరకును ఉంది.

వాక్యంతోను, ప్రేమతోను బలపర్చు బిషఫ్ డా॥కె.జాన్‌పీటర్



వేదికపై బిషప్ డా॥కె.జాన్‌పీటర్

వారి సహవాసంలో స్వార్థానికి తావులేదని సేవకులైన వారు ఎంతవేగంగా గుర్తిస్తే అంతమంచిది. ఈ సంవత్సరమంతా బిషఫ్ డా॥కె. జాన్‌పీటర్, వారి యుపిఎఫ్ పరిచర్యను గూర్చి అనుక్షణం ప్రార్థించవలసిన ఆవశ్యకత యుపిఎఫ్ లో నున్న కుటుంబాలన్నిటిపై ఉన్నదని గుర్తెరిగి ప్రార్థించాలి.




# సంతపాలెంలో బేతేలు సహవాస ప్రార్థనా మందిర ప్రతిష్ట

క్రైస్తవనాడు - యలమంచిలి ప్రతినిధి : బిషప్ డా॥జాన్‌పీటర్ స్థాపించిన యుపిఎఫ్ వారు 2007 మార్చి 12వ తేదీన సంతపాలెం, యలమంచిలి దరి బేతేలు సహవాస ప్రార్థనా మందిరాన్ని ప్రతిష్టించారు. చిన్నగ్రామమైనను చక్కనైన మందిరం ప్రభువైన యేసుక్రీస్తుని ప్రార్థించు వారి కొరకు ఏర్పాటు చేయబడింది. పరిసర ప్రాంత క్రైస్తవులు ఆ గ్రామస్థులు ఊహించని రీతిలో సామాన్య దైవసేవకులైన పాస్టర్ ఆశీర్వాదం కొరకు మందిరాన్ని ఏర్పాటు చేయించిన యేసుక్రీస్తుని తలవని వారెవరు. మందిరం చూడగానే ఆగి ఒక్కసారైనా ప్రార్థిద్దాం అనేట్లు క్రైస్తవులకన్పిస్తుందని సంతోషంగా అందరూ చెప్పకొనుట మంచి పరిణామంగా భావించవచ్చును. ఇక బోధ విషయానికి వస్తే ఆత్మీయంగానే గాక అన్నివిధాలా సేవకుల్ని బలపరచు దైవజనులు బిషప్ డా॥కె.జాన్‌పీటర్ మరియు వారి సహవాసం చేయువారి గూర్చి కొత్తగా చెప్పనవసరం లేదు. నాటి ప్రసంగం విశ్వాసం గూర్చి సాగింది. విశ్వాసం ఉన్నవారు అదే నిరీక్షణ కలిగి కడవరకూ నిలబడితే పొందనిదేదీ ఉండదని చెప్తూ దానికి నిదర్శనమే ప్రభువైన యేసుక్రీస్తు స్థానిక కాపరికి తన సేవ నిమిత్తం నిర్మింపజేసుకున్న ఈ మందిరం అని చెప్పారు. ముందు ముందు కాపరిపై ఆత్మలు సంపాదించు బాధ్యత మరెక్కువైందని కాపరి గుర్తించుకోవాలి. మందిర నిర్మాణం గావించుట ప్రభువు విషయంలోను యుపిఎఫ్ వారి విషయంలోను పెద్ద విషయం కాదుగాని ఆత్మల రక్షణకు సంపూర్ణంగా వినియోగించుట కాపర్లకు పెద్ద విషయమే.

**ప్రతిష్టాపకులు మరియు ప్రసంగీకులు**
**బిషప్ డా॥కె.జాన్‌పీటర్**

కాబట్టి కాపర్లెవరైనా భయభక్తులు కలిగి ప్రభువైన యేసుక్రీస్తు కొరకు నూతన ఆత్మలు సంపాదించి మందిరాలను నింపితేనే మందిరాలకు సార్థకత. ఈ విషయం ఆంధ్రాఅంతటా మందిరాలు కలిగియున్న కాపర్లు గుర్తించుకోవాలి. లేనియెడల వారు క్రీస్తుకొరకు చేయునదేమిలేనట్లే. వారి బ్రతుకుతెరువుకు, భవిష్యత్తులో వారికి ఆస్తిని పెంచే సాధనాలుగా మాత్రమే మందిరాలు ఉపయోగపడ్తాయని విజ్ఞులైన క్రైస్తవులనేక చోట్ల బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ విషయం గమనించదగినదే! అటువంటి వారుంటే మారాలని, లేనియెడల అలా మాట్లాడే అవకాశం అందరకూ ఇచ్చిన వారవుతారని వారు గుర్తెరగాలి. ఆ విధంగా మందిరాలను ఆస్తులుగా భావిస్తూ ఇక చాలు ఆస్తి సంపాదించుకున్నాం అనుకుంటూ సంతోషిస్తూ సంతృప్తి పడువారెవరైనా యేసుక్రీస్తు లెక్కలు సరిచూసే దేవుడని గుర్తెరగాలి సుమా! వారు తమ ఉద్దేశ్యాలను చక్కదిద్దుకొనుటకు "జీవముగల దేవుని చేతిలోపడుట భయంకరము" హెబ్రీ 10:31 వచనాన్ని గుర్తించుకోవాలని భక్తిపరులైన క్రైస్తవులు భావిస్తున్నారు.



Printed & Published and Edited, Owned by Y. Kanaka Raju, 17-108, Sanjay Gandhi Colony, Hanumanthavaka Junction, Behind Durga Temple, Visakhapatnam - 40, Andhrapradesh, Ph : 9849134647, E-mail: y_kanakaraju@yahoo.co.in., Printed at Vinay Off-set printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam -20